www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 17 మార్చి 2025
5
తిరుపతి



10వ తరగతి పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు


ఎస్పీ హర్షవర్ధన్ రాజు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: జిల్లా వ్యాప్తంగా పరీక్ష కేంద్రాల వద్ద పూర్తిస్థాయి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు తెలిపారు. స్థానిక పోలీస్ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 164 సెంటర్లలో 28, 656 విద్యార్థులు ఎస్.ఎస్.సి పరీక్షలకు హాజరుకానున్నారని, ఆ పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశాం అన్నారు. పరీక్షల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా 10 మొబైల్ పార్టీస్ ను ఏర్పాటు చేశామని తెలిపారు. డీఈఓ ఆఫీస్ లో కూడా స్ట్రైకింగ్ ఫోర్స్ ను ఏర్పాటు చేసి అక్కడ పోలీస్ సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండే విధంగా చర్యలు చేపట్టాం అన్నారు. మాస్ కాపీయింగ్, మాల్ ప్రాక్టీస్ వంటి చర్యలకు ఎవరైనా పాల్పడితే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యార్థులు ప్రశాంతంగా పరీక్ష రాయగలరని ఆకాంక్షిస్తున్నా అన్నారు.

గూడూరులో.. గోవులు మాయం..

- 150 కి పైగా అపహరణ
- పోలీస్ స్టేషన్లో ఫిర్యాదులు



ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: ఇంటి వద్ద కట్టి ఉంచిన పశువులు రాత్రికిరాత్రే దండగులు అపహరించుకు పోతున్నారు. తెల్లారేసరికల్లా దొడ్లో కట్టిన గోవులు, ఎద్దులు ఇతర పశువులు కనిపించకపోవడంతో యజమానులు లబోదిబోమంటున్నారు. ఫిర్యాదులు అందుకున్న పోలీసులు సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా దర్యాప్తు ప్రారంభించారు.

సీసీ టీవీ ఫుటేజ్ పరిశీలన

సీసీటీవీ ఫుటేజ్ చూసిన పోలీసులకు షాకింగ్ విషయాలు తెలిశాయి. కట్టి ఉంచిన ఆవులకు మత్తు ఇంజెక్షన్ ఇచ్చి అవి స్పృహ తప్పిపోయేలా చేస్తున్నారు. వెంటనే వాటిని వాహనాల్లోకి ఎక్కించేస్తున్నారు. అవి బయటకు కనిపించకుండా జాగ్రత్త పడుతున్నారు. ఆవులను తరిలించే వాహనాలకు నెంబర్ ప్లేట్లు ఉండకపోవడంతో కేసు దర్యాప్తు ముందుకు సాగడం లేదు.

150కి పైగా పశువులు అపహరణ

ఒకటి.. రెండు కాదు ఇరవై రోజుల నుంచి ఈ తతంగం సాగుతోంది. దాదాపు కోటి రూపాయలకుపైగా విలువైన 150కి పైగా ఆవులు, దూడలు, ఎద్దులు ఇతర పశువులు గూడూరులో మాయమయ్యాయి. ఒక్క గూడూరులోనే ఇది జరిగిందా? ఇంకా ఎక్కడైనా జరిగిందా? అన్న కోణంలో కూడా పోలీసులు విచారణ చేస్తున్నారు. ఇంత వరకు వేరే ప్రాంతాల్లో ఫిర్యాదులు రాలేదని అంటున్నారు.

వివిధ కోణాల్లో దర్యాప్తు

ఇలా రాత్రికిరాత్రే పశువులను చోరీ చేసిన దుండగులు ఏం చేస్తున్నారనేది పెద్ద ప్రశ్న. విదేశాలకు తరలిస్తున్నారా? లేకా స్థానికంగా ఎక్కడైనా కబేళా ఏర్పాటు చేశారా? అన్నది తేలాల్సిన విషయం. ఈ కోణంలో కూడా పోలీసు టీములు విచారణ చేస్తున్నాయి.

గుంపులుగా ఊరిమీద పడి పశువుల అపహరణ

ఇది ఒకరిద్దరి పని మాత్రం కాదని రెండు మూడు ముఠాలు కలిసి దీన్ని ఆర్గనైజ్ చేస్తున్నట్టు పోలీసులు ప్రాథమికంగా తేల్చారు. ఇందులో స్థానికులు కూడా భాగమై ఉంటారని అనుమానిస్తున్నారు. స్థానికుల భాగస్వామ్యం లేకుంటే అంత ధైర్యంగా వచ్చి ఆవులను ఎత్తుకెళ్లే సాహసం చేయబోరని అంటున్నారు. మొదట గూడూరు నిమ్మ మార్కెట్లో ఈ చోరీ మొదలు పెట్టారు. అక్కడ బండ్ల వద్ద కట్టి ఉంచిన ఎద్దులను ఎత్తుకెళ్లారు. అప్పటి నుంచి గుడూరులో చాలా పశువులు మాయమయ్యాయి. ఇందులో ఎక్కువగా గోవులు ఉండటం ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రైతు ఫిర్యాదుతో వెలుగులోకి వచ్చిన విషయం

గూడూరు రెండో పట్టణ పోలీసు స్టేషన్లో సుబ్బారెడ్డి అనే రైతు ఫిర్యాదుతో ఇది వెలుగులోకి వచ్చింది. విషయ తీవ్రతను గుర్తించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సిసి పుటేజీ, ఇతర మార్గాల్లో ఆధారాలు సేకరిస్తున్నారు. వాటి ఆధారంగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇలా గోవులు మాయమవుతున్నాయనే విషయంలో స్థానికంగా వైరల్ అయింది. దీంతో విశ్వహిందూ పరిషత్, బ్లూ-క్రాస్ సంస్థలు రంగ ప్రవేశం చేశాయి. వాళ్ళ కూడా వివిధ ప్రాంతాల్లో తిరిగి సమాచారాన్ని సేకరిస్తున్నారు. వాటి ఆధారంగా తిరుపతి జిల్లా ఎస్పీని కలిసి ఫిర్యాదు చేయనున్నారు. ఆయన పాయింట్మెంట్ సోమవారం ఇచ్చినందున కలిసి వినతి పత్రం ఇవ్వనున్నారు.

చి(చె)త్తశుద్ధి లేదు : సీపీఎం




ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : అత్యధిక రెవెన్యూ కలిగిన ప్రాంతంగా దినదినాభివృద్ధి చెందుతున్న దక్షిణ కైలాస్ నగర్‌లో చెత్త నిర్వహణ దయనీయంగా ఉందని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య విమర్శించారు. ఈ ప్రాంతం నుంచి అత్యధిక పన్నులను వసూళ్లు చేసుకుంటున్న మున్సిపల్ అధికారులు, ఆ స్థాయిలో మౌలిక వసతులను మెరుగుపరచడంలో విఫలమయ్యారని మండిపడ్డారు. స్థానిక దక్షిణ కైలాస నగర్ లో ఆదివారం సిపిఎం 4వ రోజు ప్రజా చైతన్య యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్జీవో నగర్ వాసులు ఈ సందర్భంగా తమ గోడును సీపీఎం నేతల ఎదుట వెళ్లబోసుకున్నారు. ఎన్జీవో నగర్లో ఉన్న ఏ ఒక్క వీధిలో కూడా సిసి రోడ్లు, డ్రైన్లు నిర్మించిన పాపాన పోలేదని పుల్లయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. భారీ వర్షాలు వస్తే ఈ ప్రాంతం ముంపునకు గురవుతోందని వాపోయారు. కనీసం చెత్తను తీసే వ్యవస్థ కూడా మున్సిపల్ అధికారులకు లేకుండా పోయిందని ధ్వజమెత్తారు. స్థానిక ఎమ్మెల్యే స్పందించి ఎన్జీవో నగర్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలని కోరారు. సిపిఎం ప్రాంతీయ కార్యదర్శి గంధం మణి, వెంకటేష్, కుమార్, గురునాథం తదితరులు పాల్గొన్నారు.

కాషాయం కింద కూటమి విషం చిమ్ముతోంది

కాశీనాయన అన్నదాన సత్రం కూల్చడం దారుణం : వైసిపి జిల్లా అధ్యక్షులు భూమన కరుణాకర్ రెడ్డి



ప్రజాశక్తి - తిరుపతి సిటీ:కాషాయం కింద కూటమి నాయకులు విషం చిమ్ముతున్నారని, సనాతన ధర్మం అంటూనే ఆలయాలను కూల్చడం దారుణమని వైసిపి జిల్లా అధ్యక్షులు భూమన కరుణాకర్ రెడ్డి విమర్శించారు. పద్మావతి పురంలోని ఆయన నివాసములో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ అన్నదానం నిరంతరంగా నిర్వహించే కాశి నాయన అన్నదాన క్షేత్రాన్ని కూటమి ప్రభుత్వం కూల్చేయడం బాధాకరమన్నారు. ఈ విషయమై నారా లోకేష్ తప్పు, ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎంలు ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. దేవాదాయ శాఖ మంత్రి ఈ ప్రాంతం వారైనప్పటికీ మౌనం ఎందుకు వహించారో తెలియడంలేదన్నారు. దేవదాయ శాఖ మంత్రి ఆ ప్రాంతం టైగర్ జోన్ పరిధిలో ఉండటం వల్లే కూల్చేశామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. కాశి అన్నదాన సత్రాన్ని కూల్చడాన్ని తమ పార్టీ పూర్తిగా ఖండిస్తుందన్నారు. ఈ సమావేశంలో ఆ పార్టీ నాయకులు అంజలేశ్వరి, తలారి రాజేంద్ర, నల్లని బాబు తదితరులు పాల్గొన్నారు.



- తిరుపతిలో ఎండల తీవ్రత గతం కంటే 2 నుంచి 3 డిగ్రీలు పెరుగుదల
- మార్చి నుంచే జనం విలవిల
- శ్రీవారి భక్తులు ఉక్కకు ఉక్కిరి బిక్కిరి
- చలివేంద్రాలు ఏర్పాటుపై అధికారుల నిర్లక్ష్యం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి జిల్లాలో ఉక్కపోత జనాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. నడి వేసవి రాకముందే రోళ్లు పగిలేలా ఎండలు కాస్తున్నాయి. ఫలితంగా ప్రజలు రోడ్ల మీదికి రావాలంటే హడలిపోయే పరిస్థితి నెలకొంది. ఇప్పటికే పలు ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రత దిమ్మతిరిగేలా చేస్తోంది. ఇదే తరహా వాతావరణం మరి కొన్నిరోజుల పాటు కొనసాగుతుందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లోనూ పగటి ఉష్ణోగ్రత భారీగా నమోదవుతుందని, వడగాల్పులు వీస్తాయని వారు స్పష్టం చేశారు. పెరుగుతున్న ఎండలకు వడగాల్పులు తోడు కానున్నాయి. జిల్లాలో అనేక మండలాలు వడగాల్పుల బారిన పడుతున్నాయి. ఉదయం నుంచే ఎండ తీవ్రత అధికంగా ఉంటోంది. మధ్యాహ్నానికి ఇంట్లో నుంచి అడుగు బయటపెట్టలేని పరిస్థితి ఏర్పడుతోంది. మార్చి నెల మొత్తం కూడా రాయలసీమల్లో ఎండ ప్రభావం ఎక్కవగా ఉంటుంది. చిత్తూరు, తిరుపతి జిల్లాలో శ్రీకాళహస్తి, సత్యవేడు, వరదయ్యపాలెం, రేణిగుంట, తిరుపతి రూరల్, గూడూరు, నాయుడుపేట, సూళ్లూరుపేటలలో 38 డిగ్రీల నుంచి 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మిగిలిన చోట్ల సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని ఏపీఎస్డీఎంఏ తెలిపింది.





తిరుపతి జిల్లాలో ఈ యేడాది ఉష్ణోగ్రతలు మార్చి నెలలో ఎక్కువగానే నమోదవుతున్నాయి. తిరుపతి అర్బన్‌లో గత రెండు సంవత్సరాల క్రితానికి, ఇప్పటికీ రెండు నుంచి మూడు డిగ్రీల ఉష్ణోగ్రత పెరిగిందని తిరుపతి వాతావరణ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. 2022 వ సంవత్సరంలో మార్చి 14వ తేదీన 34 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు అయింది.2023 మార్చి నెలలో 14వ తేదీ34 నుంచి 35 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యా. 2024వ సంవత్సరం మార్చి నెలలో తిరుపతిలో 35 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. 2025 సంవత్సరం మార్చి 16వ తేదీన 38 డిగ్రీల ఉష్ణో గ్రత నమోదయింది. గత మూడు సంవత్సరాల నుంచి ఇప్పటివరకు తిరుపతి వంటి నగరాల్లో ఉష్ణోగ్రతలు పెరుగుదల కనబడుతుంది. నగరం లో విచ్చలవిడిగా చెట్లను కూల్చివేయడం. కాలువ లు చెరువులు భూ కబ్జాలకు గురి కావడం, దీనికి తోడు నగరం మొత్తం సిమెంట్ రోడ్లు వేయడమే కాకుండా వర్షపు నీరు ఆగేందుకు స్థలము లేక అన్నిచోట్ల నిర్మాణాలు జరిగిపోయాయి. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ జనరల్ ఫండ్స్‌లో రెండు న్నర కోటి చెల్లించి డబుల్ డెక్కర్ బస్సు కొనుగోలు చేశారు. ఆ బస్సు నగరంలో తిరిగేందుకు నగర పాలక సంస్థ వారు 2 వేల చెట్ల కొమ్మలను నరికి వేశారు. ఇంకా అడవుల్లో చెట్లు, రోడ్డుకి ఇరువైపులా ఉన్న చెట్లను నరికి వేయడం జరిగింది. ఈ ప్రభా వంతో ఎండలు మండతున్నాయి. తిరుపతికి వచ్చే యాత్రికులు ఎండలకు సొమ్మసిల్లిపోతున్నారు. వివిధ రంగాల్లో పని చేసే కార్మికులు ఎండకు పని చేస్తుంటారు. వారికోసం ఎండ నుండి ఉపశమనం పొందే ఏర్పాట్లు నగరంలో చేయాల్సిఉంది.

ముందే వచ్చిన మండుటెండలు

సాధారణంగా వేసేవి కాలంలో మార్చి నుండి ఏప్రిల్, మే వరకు ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతాయి. కానీ ఈ సంవత్సరం మార్చిలోనే అధిక డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయ్యింది. నగరంలో పలు తారు రోడ్లు ఎండ వేడిమికి పగుళ్లిస్తున్నాయి. సిమెంట్ రోడ్లయితే అడుగు పెట్టాలంటే కష్టంగా ఉంటున్నాయి. పెరుగుతున్న ఎండలకు ఎలాంటి ముందస్తు చర్యలు ప్రభుత్వం చేపట్టడం లేదు.

చలివేంద్రాలు ఎక్కడ?

ఇటు ఎండలు అటు వడగాడ్పులతో జనం ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం ఇప్పటివరకు చర్యలు చేపట్టలేదు. తిరుమల యాత్రకు రోజుకి 80 వేలమంది రాకపోకలు సాగిస్తూ ఉంటారు. శ్రీవారిని దర్శించుకునేవారు తిరుపతిలో దిగుతారు. ఇక్కడ వేసవిని తట్టుకోవడానికి చలివేంద్రాలు, మజ్జిగ కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఆ దిశగా తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్, టీటీడీ ముందస్తు జాగ్రత్తలు చేపట్టాల్సి ఉంది. ఇప్పటికైతే ఇలాంటి చర్యలు నామం మాత్రంగానే చేసినట్లు తెలుస్తుంది.

వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

వేసవి కాలం ఎండ తీవ్రతకు గురికాకుండా దినసరి కూలీలు ఉదయంపూట పనులు పూర్తి చేసుకొని మధ్యాహ్నం నీడలో పని చేసేలా ఏర్పాట్లు చేసుకోవాలి. ప్రజలు మధ్యాహ్నం పూట బయటికి వెళ్లాలంటే గొడుగులు వెంట తీసుకెళ్లాలన్నారు. తెలుపు రంగు, పలుచటి కాటన్ వస్త్రాలు ధరించడం, ముఖానికి కర్చీఫ్ కట్టుకోవడం, టోపి పెట్టుకోవడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలి. గర్భిణీలు, బాలింతలు, చిన్న పిల్లలు, వృద్ధులు వీలైనంత వరకు ఇంట్లోనే ఉండాలి. అత్యవసరమైతే సాయత్రం ఎండ తగ్గాక బయటకు వెళ్లడం మంచిది. డీహైడ్రేట్ కాకుండా ఉండటానికి ఓఆర్ఎస్, ఇంట్లో తయారుచేసిన పానీయాలైన లస్సీ, నిమ్మకాయ నీరు, మజ్జిగ, కొబ్బరి నీరు మొదలైనవి త్రాగాలి. మంచినీరు ఎక్కువగా తీసుకోవాలని నగరపాలక సంస్థ ఆరోగ్య అధికారి డాక్టర్ యువ అన్వేష్ పేర్కొన్నారు.

చలివేంద్రాలు ఏర్పాటు చేస్తాం


కమిషనర్ మౌర్య

వేసవి దృష్ట్యా కార్పొరేషన్ పరిధిలో ప్రజలు ఎక్కువ తిరిగి చోట చలివేంద్రాలు ఏర్పాటు చేస్తామని కమిషనర్ మౌర్య పేర్కొన్నారు. ఆరోగ్య సిబ్బందిని తగు ఏర్పాట్లు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించామని తెలిపారు.

ఇదేనా స్వర్ణాంధ్ర.. స్వచ్ఛ ఆంధ్ర ?



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలోని 14 వార్డులో చెత్త కుప్పలు నిండి పోయి వీధులపై పొర్లుతున్నాయి. దుర్వాసనతో భరించలేకు మున్సిపల్ శాఖ వారికి పలుసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెత్త చెదారాలు ఇలా చేరడంతో దోమలు వృద్ధిచెంది అనారోగ్యం పాలవుతున్నామన్నారు. పన్నుల వసూలు ముందుండే అధికారులు పారిశుధ్యంపై ఎందుకు ధ్యాస పెట్టడం లదని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ శాఖ స్పందించి పారిశుద్ధ్య లోపం లేకుండా చూడాలని, లేని పక్షంలో వార్డు ప్రజలు మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన చేపడతామని హెచ్చరించారు.

14 వ వార్డులో చెత్త రోడ్డుపై చేరి రోగాల పాలవుతున్నాం. మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం వీడి పారిశుధ్య చర్యలు వెంటనే చేపట్టాలి. - నాగరాజు

జాతీయ తెలుగుభాష మాధురీ పురస్కారాలు

అందరినీ ఆకట్టుకున్న జానపద పద్యగానం



ప్రజాశక్తి - తిరుపతి సిటీ : తెలుగు కళా రత్నాలు సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ సి యు ఓ డా. యు. వి రత్నం, అంతర్జాతీయ ప్రోగ్రామ్ కన్వీనర్ డా. ధనాశి ఉషారాణి నిర్వహణలో ఆదివారం తిరుపతి యూత్ హస్టల్‌లో తెలుగు భాష పరిరక్షణపై జరిగిన జానపద పద్య గానం అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో 100 మంది కవులు రచయితలు అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర స్థాయి, వివిధ ప్రాంతాలు నుండి హాజరయ్యారు. ముఖ్య అతిధిలుగా షిటిమ్ ఆఫీసర్ సుమతీ, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం డిగ్రీ కళాశాల హెచ్ ఓ డి కృష్ణవేణి, కథ రచయిత పేరూరు బాలసుబ్రహ్మణ్యం, తెలుగు మహిళ అధ్యక్షురాలు హేమావతి, పలువురిని తెలుగు మాధురీ పురస్కారంతో ధనాశి ఉషారాణి జ్ఞాపికలు ప్రశంసా పత్రాలు శాలువా పుష్పగుచ్చాలతో ఘనంగా సత్కరించి అభినందించారు. జానపద కళాకారులు రెడ్డిప్రసాద్ రెడ్డెప్ప, రాజశేఖర్,ధనాసి ఉషారాణి తెలుగు భాష విశిష్టత పై జానపదం వినిపించడంతో తెలుగు బాష మాధుర్యం సభలో నిండుగా ఉత్తేజమైంది. అనంతరం సంస్థ సి. యు.ఓ డా యు. వి రత్నంకి జాతీయ సహస్రప్రజ్ఞా నిధి పురస్కారం, షీటీమ్ ఆఫీసర్ సుమతి, ధనాశి ఉషారాణిలను ప్రస్తావించారు. ధనాశి ఉషారాణిని తెలుగు మాధురీ పురస్కారంతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కవులు, కళాకారులు, రచయితలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అమరజీవికి ఘన నివాళి


కల్లివెట్టు ఉన్నత పాఠశాలలో పొట్టి శ్రీరాములుకు నివాళి అర్పిస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు కోసం అశువులు బాసిన అమరజీవి పొట్టి శ్రీరాములు అని కవి, రచయిత, తెలుగు ఉపాధ్యాయులు యువశ్రీ మురళి పేర్కొన్నారు. ఆదివారం పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని మండలంలోని కల్లివెట్టు ఉన్నత పాఠశాలలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి విద్యార్థులతో కలసి పుష్పాంజలి ఘటించారు.

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : పొట్టి శ్రీరాములను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ పేర్కొన్నారు. పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా టవర్ క్లాక్ సెంటర్ వద్ద ఉన్న విగ్రహానికి ఎమ్మెల్యే సునీల్ కుమార్ నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సోమిశెట్టి చెంచురామయ్య, బిల్లు చెంచురామయ్య, ఇజ్రాయిల్, రహీం పాల్గొన్నారు.

ప్రజాశక్తి - నాయుడుపేట: పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను ఆర్యవైశ్య సంఘం నాయకులు ఆదివారం నాయుడుపేటలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతి జిల్లా రూరల్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు గూడూరు కిషోర్ కుమార్, ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర కార్యదర్శి కనుమరులపూడి సురేష్, పలువురు ఆర్యవైశ్య సంఘం నాయకులతో కలిసి నాయుడుపేట పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద గల శ్రీ పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి రూరల్ జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి గాదంశెట్టి నాగరాజు. నాయుడుపేట ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కోట వెంకటేశ్వర్లు, మల్లికార్జున్, మెంటా కృష్ణారావు, కిరణ్, మధు, చంద్రశేఖర్, నాయుడుపేట ఆర్యవైశ్య సంఘం కార్యవర్గ సభ్యులు శ్రీ వాసవి యువజన సమైక్య కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి దుద్దెల బాబు, బొమ్మగుంట రవి సస్పెన్షన్

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: వైఎస్ఆర్సిపి నుంచి దుద్దెల బాబు, బొమ్మగుంట రవిలను సస్పెండ్ చేస్తున్నట్లు ఆ పార్టీ నగర అధ్యక్షులు మల్లం రవిచంద్ర రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ సిద్ధాంతాలు, నియమాలకు వ్యతిరేకంగా, పార్టీ ప్రతిష్ట దెబ్బతీసేలా వ్యవహరిస్తుండడంతో వారి ఇరువురిని పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు వెల్లడించారు.

పెద్ద పులి రూటెటు..?



ముఖా ముఖి



- పెద్దపులుల సంఖ్య పెరిగితే శేషాచలం వైపే?
- ఇప్పటికే శేషాచలం- నల్లమల మధ్య కారిడార్లు
- శేషాచలంలో కొనసాగుతున్న చిరుతల గణన
- ఎంపిక చేసిన హెరిటేజ్ ప్రాంతాలను పరిరక్షిస్తాం
- ప్రజాశక్తి ఇంటర్వ్యూలో సీసీఎఫ్ సెల్వం



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శేషాచలం అడవిలో పెరుగుతున్న చిరుతపులులకు తోడు నల్లమల అడవులలో రోజు రోజుకు పెరుగుతున్న పెద్దపులుల సంఖ్య కారణంగా త్వరలోనే శేషాచలం అడవులలోకి పెద్ద పులులు ప్రవేశించే అవకాశాలు ఉన్నట్టుగా ప్రస్తుత పరిస్థితులు బట్టి చెప్పవచ్చు. విస్తారమైన నల్లమల అడవులలో పెద్ద పులులు వాటి ఆవాసాలను ఏర్పాటు చేసుకొని జీవించడానికి అనుకూలమైన పరిస్థితులు ప్రస్తుతం కొనసాగుతున్నాయి. 200 సంఖ్య పెద్ద పులులు దాటితే అటు లంకమల అడవులలోకి, శేషాచలం అడవులలోకి రావడానికి పూర్తిగా అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే ఈ అడవుల మధ్య కారిడార్లు ఉన్నాయని, శేషాచలం అడవులలో చిరుతపులుల గణన ప్రతి ఏడాది నిర్వహిస్తున్నామని తిరుపతి సర్కిల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ సెల్వం ప్రజాశక్తి నిర్వహించిన ప్రత్యేక ఇంటర్వ్యూలో తెలిపారు. భవిష్యత్తులో శేషాచల అడవులలోకి పెద్దపులుల రాక అనివార్యమా?, రోజు రోజుకి పెరిగిపోతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా వన్యప్రాణుల దాహార్తి తీర్చడానికి తీసుకున్న చర్యలు వివరించారు. అదేవిధంగా అడవులలో ఉన్న ప్రముఖ పుణ్యక్షేత్ర ఆలయాలను, అటవీ ప్రాంతాలను పరిరక్షించుకోవడానికి బయోడైవర్సిటీ ఆధ్వర్యంలో హెరిటేజ్ ప్రాంతాలను ఇప్పటికే గుర్తించామని తెలిపారు.

ప్రజాశక్తి: విస్తారమైన శేషాచల అడవులలో నానాటికి పెరిగిపోతున్న చిరుతపులుల సంఖ్యకు, జనావాసాలలో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించండి?

సిసిఎఫ్: శేషాచలం అటవీ పరిధిలో కరోనా సమయం నుండి చిరుతపులుల సంఖ్య గణనీయంగా పెరిగిందని చెప్పవచ్చు. ప్రస్తుతం శేషాచలం అడవులలో చిరుతపులుల గణన కొనసాగుతోంది. అయితే అడవిలో సుదూర ప్రాంతం వరకు చిరుతలు తమ ఆహార అన్వేషణను కొనసాగిస్తాయి. జనావాసాలలోకి చిరుతలు రావడం అనేది నేడు సర్వసాధారణంగా మారింది. అయితే ప్రజలు వారి నివాస ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, వీధి కుక్కలు ఆహారం కోసం జనావాసాలలో తిరుగుతుండడంతో చిరుతపులులు వాటి కోసం వస్తున్నాయి. తిరుపతి వేదిక్ విశ్వవిద్యాలయంలో గత నాలుగు నెలల కాలంగా చిరుతపులుల సంచారం జరుగుతోంది. అటవీ శాఖ నుండి అక్కడివారికి తగిన జాగ్రత్తలు, సూచనలు ఇప్పటికే చేసి ఉన్నాము. చిరుతలను బంధించడానికి బోన్లను ఏర్పాటు చేసి 50 రోజులు గడుస్తున్నా అవి ఎంతో తెలివిగా ఆలోచిస్తూ బోన్లకు చిక్కడం లేదు. విశ్వవిద్యాలయ పరిధిలో హాస్టల్స్‌లో ఉన్న విద్యార్థులు వారు వినియోగించిన ఆహార వస్తువులను సరైన పద్ధతిలో డిస్పోజ్ చేయాలి. అదేవిధంగా కుక్కల సంచారాన్ని కూడా తగ్గించగలిగితే చిరుత కదలికలు విశ్వవిద్యాలయంలో కనపడవు.

ప్రజాశక్తి: పెద్ద పులుల సంఖ్య పెరిగితే ఆవాస అన్వేషణలో భాగంగా వేరే ప్రాంత అడవులకు వచ్చే అవకాశాలు ఎంతవరకు ఉన్నాయి?

సిసిఎఫ్: శేషాచలం అడవులలో గతంలో పెద్ద పులులు ఉండేవని రికార్డుల ద్వారా తెలుస్తోంది. కానీ ప్రస్తుతం నల్లమల ఫారెస్ట్ పరిధిలో టైగర్ రిజర్వ్ జోన్ ఉంది. ఇక్కడ పెద్ద పులులు వాటి ఆవాసాలను ఏర్పాటు చేసుకొని సంతతిని పెంచుకోవడానికి అనుకూలమైన పరిస్థితులు ఉన్నాయి. నల్లమల ఫారెస్ట్‌లో పెద్ద పులులు సంఖ్య పెరిగిందనే సమాచారం ఉంది. 200 నుండి 250 సంఖ్య పెద్ద పులులు దాటితే అటు లంకమల ఫారెస్టుకు, ఇటు శేషాచలం ఫారెస్టుకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. వన్యప్రాణులు స్వేచ్ఛాయుత జీవనాన్ని గడపడానికి కారిడార్లు ఇప్పటికే ఉన్నాయి. ప్రస్తుతం నల్లమల ఫారెస్ట్‌లో ఉన్న పెద్దపులుల సంఖ్యకు అటు లంకమలకు, ఇటు శేషాచలంకు వచ్చే అవకాశం లేదు. భవిష్యత్తులో సంతతిని బట్టి అటవీశాఖ ఆధ్వర్యంలో సంరక్షణ చర్యలతో పాటుగా, ప్రజలను అప్రమత్తంగా వ్యవహరించడానికి తగిన చర్యలు తీసుకుంటాం.

ప్రజాశక్తి: పెరుగుతున్న ఉష్ణోగ్రతలకు అనుగుణంగా శేషాచలం అటవీ పరిధిలో వన్యప్రాణుల సంరక్షణకు అటవీశాఖ తీసుకున్న చర్యలను వివరించండి?

సిసిఎఫ్: రోజురోజుకీ ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. శేషాచలం అడవిలో వన్యప్రాణుల సంరక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తూ వాటికి దాహార్తి తీర్చడానికి ఇప్పటికే ఉన్న నీటి తొట్టెలుతోపాటుగా అదనంగా నీటి తొట్టెలను నిర్మించడం జరిగింది. జనవరి మాసం నుండి వన్యప్రాణులకు దాహం తీర్చడానికి అటవీశాఖ ఆధ్వర్యంలో ఆ తొట్టెలలో నీరు నింపడం జరుగుతోంది. అడవిలో విరివైన ఆహారం వన్యప్రాణులకు ఉన్నాయి. వేటాడే క్రమంలో తప్పించుకోవడానికి కొన్ని జీవులు జనావాసాల్లోకి రావడం తరచుగా జరుగుతోంది. దాహార్తి తీర్చుకోవడానికి జనావాసాల్లోకి వన్యప్రాణులు రావడం చాలా అరుదు. వన్యప్రాణుల సంరక్షణకు కట్టుదిట్టమైన చర్యలను ఇప్పటికే ప్రారంభించాం. అటవీ భూభాగం వేసవిలో ఏర్పడే కార్చిచ్చుల వలన కాలిపోకుండా ఫైర్ లైన్స్ ఇప్పటికే పూర్తి చేశాం. ఏటవాలు అటవీ భూమిలో, సమాంతర ఆటవి భూమిలో ఈ ఫైర్ లైన్స్ ఏర్పాటు చేయడం జరిగింది.

ప్రజాశక్తి: శేషాచలంలో ఔషధ గుణాలు, ప్రావీణ్య అటవీ ప్రాంతాల సంరక్షణకు తీసుకున్న చర్యలను వివరించండి?

సిసిఎఫ్: శేషాచలం అటవీ పరిధి అనేది చాలా విస్తారమైనది. ఈ పరిధిలో ఎంతో విశిష్టమైన పుణ్యక్షేత్రాలు, తీర్థాలు, ఆలయాలు ఉన్నాయి. వీటి రక్షణ కోసం తమిళనాడు కేంద్రంగా పనిచేసే నేషనల్ బయోడైవర్సిటీ వారి సూచనల మేరకు ఇటీవల జరిగిన సమావేశంలో తిరుపతి జిల్లా పరిధిలోని పుత్తూరు వద్ద ఉన్న కైలాస కోన, తలకోన, కపిలతీర్థం, జపాలితీర్థం ప్రాంతాలను హెరిటేజ్ సైట్ లుగా బయోడైవర్సిటీ రాష్ట్ర బోర్డు ఏర్పాటు చేయాలని తీర్మానం చేసింది. ఈ తీర్మానాన్ని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వ పరిశీలనకు పంపింది. ఈ ప్రాంతాలలో ప్రత్యేకమైన పరిరక్షణ చర్యలను త్వరలోనే ప్రారంభించబోతున్నాం. ఈ ప్రాంతాల సంరక్షణకు ప్రభుత్వం నుండి అదనపు నిధులు, సిబ్బంది కేటాయింపబడతారు. భావితరాలకు ఈ ప్రాంత విశిష్టతను తెలిపే విధంగా తగిన చర్యలను, సంరక్షణను అటవీశాఖ ఆధ్వర్యంలో తీసుకోబడుతుంది. ఇప్పటికే ఇటువంటి హెరిటేజ్ సైట్ నిర్ణయాల ద్వారా దేశవ్యాప్తంగా ఎన్నో ప్రాంతాలు పరిరక్షింపబడుతున్నాయి.

ముత్యాలమ్మ జాతరకు రండి: ఎమ్మెల్యే పాశిం




ప్రజాశక్తి - గూడూరు టౌన్ : చిల్లకూరు మండలం తూర్పు కనుపూరు గ్రామంలో ఈనెల 25వ తేదీ నుండి నిర్వహించనున్న ముత్యాలమ్మ జాతరకు వచ్చి ఆశీర్వాదాలు పొందాలని గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ కోరారు. తూర్పు కనుపూరు ముత్యాలమ్మ జాతర ఆహ్వాన పత్రికలను ఎమ్మెల్యే సునీల్ కుమార్ ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈనెల 25వ తేదీ నుండి ఘనంగా జరుగుతాయని భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవో నవీన్ కుమార్, నాయకులు పాల్గొన్నారు.

ఆర్‌టిసి సర్వీస్‌లను పునరుద్ధరించాలి

ప్రజాశక్తి - గూడూరు టౌన్: గూడూరు డిపో పరిధిలో రద్దు చేసిన పలు ఆర్‌టిసి బస్సు సర్వీసులను పునరుద్ధరించాలని, పలు సమస్యలను పరిష్కరించాలని గూడూరు ఆర్‌టిసి ఎన్‌ఎంయూ నాయకులు ఎమ్మెల్యే సునీల్ కుమార్‌ను ఆదివారం కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఎన్ఎంయు నాయకులు మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా 20 బస్సు సర్వీసులు రద్దు చేశారన్నారు. ఈనెలలో కొత్త సర్వీసులు ఎమ్మెల్యే డీటీవీ ముందు ప్రారంభిస్తామని చెప్పిన డిపో మేనేజర్ వాటిపై ఇంతవరకు నోట్ ఫైల్ రెడీ చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంయు నాయకులు ప్రవీణ్, బాషా, శ్రీనివాసులు, హరి పాల్గొన్నారు.

తిరుపతి ప్రైవేట్ ట్రావెల్స్ అసోసియేషన్ అధ్యక్షుడుగా రూపేష్




ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుపతి ప్రైవేట్ ట్రావెల్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా రూపేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం నగరంలోని ముత్యాలమ్మ ఆలయ ప్రాంగణంలో జరిగిన తిరుపతి ప్రైవేట్ ట్రావెల్స్ అసోసియేషన్ కార్యవర్గ ఎన్నికలకు కన్వీనర్ బొడుగు మునిరాజా యాదవ్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ప్రధాన కార్యదర్శిగా భాషా, కోశాధికారిగా మల్లికార్జునలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ట్రావెల్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు శ్రీనివాసులు, కేశినేని ట్రావెల్స్ సుబ్రమణ్యం, ఎంఎంఆర్ ట్రావెల్స్ మని చంద్ర, గరుడ ట్రావెల్స్ రాము, జగన్, ట్రావెల్స్ మురళిలతో పాటు పలువురు ట్రావెల్స్ నిర్వాహకులు పాల్గొన్నారు.

కూరగాయలు, గుడ్లు పంపిణీ


ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సివిసి పాయ్యలో ఒగ్గు భాస్కర్ దాతృత్వంలో ప్రత్యేక ప్రతిభావంతులకు ఆదివారం ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంఈఓ రవూఫ్ చేతుల మీదుగా కూరగాయలు, గుడ్లు పంపిణీ చేశారు. జేవివి ఉపాధ్యక్షులు చెంచు నారాయణ మాట్లాడుతూ జేవివి ఆధ్వర్యంలో వివిధ ప్రతిభావంతులకు ప్రతినెల మూడవ ఆదివారం కూరగాయలు, గుడ్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, చెంచు నారాయణ, రామ మోహన్, ప్రభాకర్, ఇబ్రహీం, అరుణ్ కుమార్, పవన్ కుమార్, సురేష్, శ్రీనివాసాచారి, గుండాల సుందరం, సుధీర్ పాల్గొన్నారు.

మణికంఠరాజు కుటుంబానికి రోజా పరామర్శ



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : వడమాల పేట మండలం, ఎస్‌బిఆర్ పురంలో వైఎస్‌ఆర్‌సిపి నాయకులు నాగరాజు సోదరుడు వేంపల్లి మణికంఠరాజు ఇటీవల మృతి చెందారు. మాజీ మంత్రి రోజా ఆదివారం ఆయన ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. రోజా వెంట వడమాలపేట సీనియర్ నాయకులు మాజీ జెడ్పీటీసీ నెంబర్ సురేష్ రాజు, కార్యకర్తలు ఉన్నారు.

మూసేసిన దారిని తెరిపించండి



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలోని స్థానిక రైల్వే స్టేషన్‌కు ఎన్నో ఏళ్లుగా ప్రయాణిస్తున్న రహదారిని రైల్వే అధికారులు మూసివేశారు. ఈ దారిని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఆదివారం పరిశీలించారు. పట్టణ ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఈ రహదారి మీదుగా రైల్వేస్టేషన్‌కు వెళ్లేవారని ఆ శాఖ ఈ దారిని మూసి వేయడంతో తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గతంలో స్థానికులు ఎమ్మెల్యేకు వివరించారు. స్పందించిన ఆయన టిడిపి నాయకులతో కలిసి ఆదివారం ఈ దారిని పరిశీలించారు. మార్కెట్‌ను సందర్శించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైల్వే అధికారులతో చర్చించి మూసివేసిన దారిని తిరిగి ప్రారంభించడానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు గాలి జీవరత్నం నాయుడు, మాజీ మున్సిపల్ ఛైర్మన్ బిసిఆర్ యుగంధర్, బి మురళి, మాజీ వైస్ ఛైర్మన్ ఏ ఆనంద్, గోపినాథ్ నాయకులు పాల్గొన్నారు.

19న 'చలో విజయవాడ'ను జయప్రదం చేయండి



ప్రజాశక్తి - తిరుపతి టౌన్: ఆప్కాస్ రద్దుకు వ్యతిరేకంగా మార్చి 19న నిర్వహించే చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం సి.ఐ.టి.యు జిల్లా కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆప్కాస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జి.చిన్న బాబు, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎస్.జయచంద్ర, కాంట్రాక్ట్, అవుట్సోర్సింగ్ ఎంప్లాయిస్ తిరుపతి జిల్లా జేఏసీ ఛైర్మన్ గండికోట నాగవెంకటేష్‌లు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆప్కాస్ రద్దు చేస్తున్నట్లు అనాలోచిత నిర్ణయాన్ని తక్షణమే విరమించుకోవాలన్నారు. ఈ ధర్నాలో వేలాదిమంది పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

వ్యవసాయ శాఖ కార్యాలయమా.. ఎక్కడ నీ చిరునామా..?

▪ కూలడానికి సిద్ధంగా ఉన్న అగ్రికల్చర్ ఆఫీసర్ భవనం ▪ నిరుపయోగంగా ఉన్న గోడౌన్ ▪ రోజుకొక దగ్గర వ్యవసాయ శాఖ కార్యాలయం

ప్రజాశక్తి - రామచంద్రపురం: వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయమా.. నీ చిరునామా ఎక్కడ అంటూ రైతులు వెతుక్కుంటున్నారు. మండల కేంద్రంలో 1989 సంవత్సరంలో కమ్మపల్లి మండల వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయ భవనాన్ని నిర్మించి ప్రారంభించారు. ఆ భవనం శిథిలావస్థకు చేరుకుంది. వర్షం వస్తే వర్షపు నీరు కురుస్తుండటంతో వ్యవసాయ శాఖ కార్యాలయాన్ని 2009 వ సంవత్సరంలో పక్కనే ఉన్న వ్యవసాయ శాఖ గోడౌన్‌లోకి మార్చారు. ఆ గోడౌన్ భవనం సీలింగ్ నుండి సిమెంట్ పెచ్చులు ఊడిపడటంతో కార్యాలయంలో ఉండలేక వ్యవసాయ శాఖ సిబ్బంది కార్యాలయాన్ని వెలుగు కార్యాలయంపై భాగంలో ఉన్న ఉపాధి హామీ కార్యాలయ గదుల్లోకి మార్పు చేశారు. గత వైసిపి ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేయడం వల్ల వ్యవసాయ శాఖ అసిస్టెంట్లు రైతు భరోసా కేంద్రాలకు పరిమితం చేశారు. దీంతో మండల వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయాన్ని కూడా గంగిరెడ్డిపల్లి ఎన్టీఆర్ రైతు సేవ కేంద్రానికి మార్పుకున్నారు. మండల కేంద్రంలో వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయం లేక, వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బందితో పాటు రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. నిరుపయోగంగా ఉన్న వ్యవసాయ శాఖ గోడౌన్ మరమ్మతులు చేసి ఉపయోగంలోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు. ఇకనైనా ప్రజా ప్రతినిధులు, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు స్పందించి కూలడానికి సిద్ధంగా ఉన్న వ్యవసాయ శాఖ కార్యాలయాన్ని కూల్చివేసి ఆ స్థలంలో నూతన వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయాన్ని నిర్మించాలని మండలంలోని రైతులు కోరుతున్నారు.



దుస్థితిలో ఉన్న వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయం



నిరుపయోగంగా ఉన్న వ్యవసాయ శాఖ గోడౌన్


గోడౌన్ మరమ్మతులు చేయించాలి



మండలంలో నిరుపయోగంగా ఉన్న వ్యవసాయ శాఖ గోడౌన్‌ను మరమ్మతులు చేసి ఉపయోగంలోకి తీసుకురావాలి. రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు నిలువ ఉంచుకునేందుకు గోడౌన్ లేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఎరువులు, విత్తనాలు నిల్వ ఉంచడానికి ప్రైవేటు భవనాలను అద్దెకు తీసుకోవాల్సి వస్తుంది. అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

- కె.చంద్రశేఖర్ రెడ్డి, రైతు, అనుపల్లి పంచాయతీ

వ్యవసాయ శాఖ కార్యాలయాన్ని నిర్మించండి



మండల కేంద్రంలో వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయం లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. వ్యవసాయ శాఖ సిబ్బంది ఎప్పుడు ఏ ఎన్టీఆర్ రైతు సేవ కేంద్రంలో ఉంటారో తెలియక వారిని వెతుక్కుంటూ వెళ్ళాల్సి వస్తోంది. అన్ని సౌకర్యాలతో వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయం నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరుచేసి భవనం నిర్మించాలి.

- కే మోహన్ రెడ్డి, రైతు, గడ్డకింద పల్లి

పదో తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం

ప్రజాశక్తి - పిచ్చాటూరు: మార్చ్ 17 వ తేదీ నుంచి 31 వరకు పదో తరగతి పరీక్షల నిర్వహణకు పిచ్చాటూరు స్థానిక జడ్పీ హైస్కూల్‌లో రెండు కేంద్రాలుగా విభజించి 'ఏ' కేంద్రంలో 171 మంది మరియు 'బి' కేంద్రంలో 141 మంది మొత్తం 312 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలు రాయనున్నట్లు ఎంఈఓ తెలిపారు.

ప్రజాశక్తి - నాగలాపురం : పదో తరగతి పరీక్షల నిర్వహణకు మండలంలో రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పాటుచేశామని, వాటిలో పిల్లలకు ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఎంఈవో బాబయ్య, ఎంఈఓ జనార్ధన రాజు తెలిపారు. నాగలాపురం, బీర కుప్పం రెండు పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయని ఆయన వెల్లడించారు.

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : పది పరీక్షకు ఏర్పాట్లు అన్ని పూర్తి చేసినట్టు గూడూరు డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి సనత్ కుమార్ పేర్కొన్నారు. గూడూరు పట్టణ, రూరల్ పరిధిలో 8 పరీక్ష కేంద్రాలు, 1405 మంది విద్యార్థులు హాజరు కానున్నారని తెలిపారు. గూడూరు పట్టణంలో జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, జి.ఎస్.ఆర్.ఎం ఉన్నత పాఠశాల, సి.ఎస్.ఎం ఉన్నత పాఠశాల, సెయింట్ మెరిస్ పాఠశాల, శ్రీ వివేకా నంద, నారాయణ, జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల (చెన్నూరు) పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు వ్రాయనున్నారు.

ప్రజాశక్తి -బుచ్చినాయుడు కండ్రిగ: పదవ తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం చేశామని బుచ్చినాయుడు కండ్రిగ జెడ్‌పి హైస్కూలు ప్రధానోపాధ్యాయులు రమణయ్య పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్థానిక జెడ్పీ హైస్కూల్, చల్లమాంబాపురం, పల్లమాల, నెలవాయి, బుచ్చినాయుడు కండ్రిగ ప్రభుత్వ పాఠశాలలు, శ్రీనివాస్ తేజ వికాస్, అక్షర ఎస్వీఆర్ ప్రైవేటు పాఠశాలలు కలిసి బుచ్చినాయుడు కండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రెండు కేంద్రాలుగా విభజించి పరీక్షలు రాయబోతున్నారన్నారు. ఈ కేంద్రాలలో 306 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలు రాయనున్నట్లు హెడ్మాస్టర్ తెలిపారు.

ప్రజాశక్తి - రామచంద్రాపురం: పదవ తరగతి ప్రభుత్వ పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు చంద్రగిరి ఎంఈఓ లు లలిత కుమారి, బాబు, చంద్రగిరి సీఐ సుబ్బరామిరెడ్డి తెలిపారు. చంద్రగిరి మండలంలో ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, శ్రీ పద్మావతి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, జడ్పీ హైస్కూల్ రంగంపేట, జడ్పీ హైస్కూల్ తొండవాడ, జడ్పీ హైస్కూల్ ఫనబాకం, శ్రీ చైతన్య చిల్డ్రన్స్ అకాడమీ హై స్కూల్ , శ్రీ చైతన్య టెక్నో హై స్కూల్‌లను పరీక్ష కేంద్రాలుగా ఏర్పాటు చేశామన్నారు. ఈ ఏడు పరీక్షా కేంద్రాలలో మొత్తం 1100 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలియజేశారు. రామచంద్రపురం మండలంలో కుప్పం బాదూరు, కమ్మ కండ్రిగ,నెత్తకుప్పం,కేకేవి పురం, సొరకాయల పాలెం ఉన్నత పాఠశాలలను పరీక్షా కేంద్రాలుగా ఏర్పాటు చేసినట్లు మండల విద్యాశాఖ అధికారులు మార్కండేయ నాయుడు చెప్పారు. ఐదు పరీక్ష కేంద్రాలలో సుమారు 356 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలియజేశారు. పడమాల పేట మండలం పత్తిపుత్తూరు ఉన్నత పాఠశాల నుంచి, తిరుపతి రూరల్ మండలం బ్రాహ్మణపట్టు, దుర్గ సముద్రం ఉన్నత పాఠశాలల నుంచి విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు.

ప్రజాశక్తి -కోట : నేటి నుండి జరగబోయే పదవ తరగతి పరీక్షలును పకడబందీగా నిర్వహించాలని స్థానిక ఎమ్ ఈ ఓ దారా మస్తానయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ కోట మండలంలో కోట ఎస్సీ గురుకుల, బీసీ గురుకుల, జిల్లా పరిషత్ బాలుర, బాలికల పాఠశాలలు, బాలభారతి, చిట్టేడు ఎస్టీ గురుకుల పాఠశాలల్లో పరీక్షలు జరుగుతాయాన్నారు. ఆరు కేంద్రాల్లో 959 మంది రెగ్యులర్ విద్యార్థులు, 12 మంది కంపార్ట్మెంట్ విద్యార్థులు కలిపి మొత్తం 971 మంది విద్యార్థులు పరీక్షలు హాజరు కానున్నట్లు తెలిపారు.

గూడూరు చెరువు కట్టపై జంగిల్ క్లియరెన్స్ పనులు



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు చెరువు కట్టపై జంగిల్ క్లియరెన్స్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఎండను సైతం లెక్కచేయకుండా గూడూరు పురపాలక కమిషనర్ వెంకటేశ్వర్లు పనులను పర్యవేక్షిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ చొరవతో చెరువును ఆధునీకరణ చేస్తామని తెలిపారు. వాకింగ్ ట్రాక్, గ్రీనరీలను చెరువు కట్టపై ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.

పశ్చిమ కనుమల వృక్ష సంపద అధ్యయన యాత్ర



ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విద్యాలయ వృక్షశాస్త్ర విద్యార్థులు మూడు రోజుల పశ్చిమ కనుమల వృక్ష సంపద, జీవవైవిధ్యం అధ్యయన యాత్రకు శ్రీకారం చుట్టారు. వృక్ష శాస్త్ర విభాగ అధ్యాపకులు ఆచార్యులు నాగలక్ష్మి దేవమ్మ, కామాక్షమ్మ, వేణు, అంకన్న ల పర్యవేక్షణలో, విద్యార్థులు రూపేష్, శివాని నాయకత్వంలో విభాగంలో సుదీర్ఘకాలం తర్వాత మొదటి, రెండవ సంవత్సర విద్యార్థిని విద్యార్థులు " పశ్చిమ కనుమలు వృక్ష సంపద, జీవవైవిధ్యం" అనే అంశం పై హొగేనెక్కల్ జలపాతం, టీ ఫ్యాక్టరీ, థ్రెడ్ గార్డెన్, రోజ్ గార్డెన్, నేషనల్ బొటనికల్ గార్డెన్, ఊటీ కొండలు, అతిరేపల్లి జలపాతం - కేరళ ప్రదేశాలను సందర్శించి మొక్కల అధ్యయనం చేయడం జరిగిందన్నారు. విద్యార్థులు అధ్యయనంతో పాటు, వైవిధ్యమైన మొక్క భాగాల సేకరణ చేపట్టడం జరిగిందని, వాటిని హెర్బేరియం షీట్ ల ద్వారా నిల్వ ఉంచుతామని అధ్యాపకులు తెలియజేశారు. విద్యార్థులు మాట్లాడుతూ ఈ అధ్యయన యాత్ర చాలా ఉపయుక్తంగా ఉందని అన్నారు. వీరు రేపు వర్సిటీని తిరిగి చేరుకోనున్నారు.


బీద రవిచంద్రను కలిసిన వాకా విజయభాస్కర్ రెడ్డి



ప్రజాశక్తి -కోట : కోట మండలంలోని విద్యానగర్ కు చెందిన సీనియర్ టీడీపీ నాయకులు వాకా విజయభాస్కర్ రెడ్డి నెల్లూరు లోని ఎమ్మెల్సీ గా ఎన్నికైన బీద రవిచంద్ర నివాసంలో మర్యాదపూర్వకంగా పూలమాలలు వేసి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.అనంతరం ఎమ్మెల్సీ అభ్యర్థి బీద.రవిచంద్ర విద్యానగర్ కు చెందిన టీడీపీ నాయకులు వాకా.విజయభాస్కర్ రెడ్డి తో పాటు ఉన్న టీడీపీ నాయకులుతో ప్రస్తుత రాజకీయాలును గూర్చి చర్చించారు.బీద రవిచంద్ర ను కలిసిన వారిలో సుబ్రహ్మణ్యం,మురళి,తదితరులు ఉన్నారు.

'ఆన్ లైన్' ఆట.. ఆగమవుతున్న బతుకు బాట

➤ సరదాగా మొదలెట్టి వ్యసనంగా మార్చుకుంటున్న యువత
➤ మొదట్లో లాభం చూపి.. ఊబిలోకి లాగుతున్న జూదం
➤ అప్పులు తీర్చుకోచ్చని భావిస్తూ మరింతగా కూరుకుపోతున్న తీరు!



ప్రజాశక్తి -బుచ్చినాయుడు కండ్రిగ: కాయ్ రాజా.. కాయ్.. వంద పెట్టండి వెయ్యి గెలుచుకోండి. ఒకప్పుడు ఎక్కడో సందుగొందుల్లో గుట్టుగా సాగిపోయే ఈ బెట్టింగ్ వ్యవహారం... ఇప్పుడు పలు యూట్యూబ్ ఛానళ్లు, వెబ్‌సైట్ల ద్వారానే కాకుండా మొబైల్ యాప్‌ల రూపంలోనూ అమాయకుల జేబులు కొల్ల గొడుతున్నాయి. పందేల మోజులో పడి కొందరు కుటుంబాలను ఛిన్నాభిన్నం చేసుకుంటుంటే.. నష్టపోయిన మరికొందరు యువకులు మోసాలకు పాల్పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. ముఖ్యంగా తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గంలో రోజురోజుకీ పెరుగుతున్న ఈ తరహా మోసాలు కలవర పెడుతున్నాయి.

ఆన్ లైన్ ఆట జీవితంతో ఆడేసుకుంటుంది : సర్కిల్ ఇన్‌స్పెక్టర్ తిమ్మయ్య



ప్రస్తుత రోజుల్లో ప్రతి ఒక్కరూ ఖాళీ సమయాల్లో ఏం చేయాలో తెలియక మొబైల్తోనే ఎక్కువగా గడుపుతున్నారు. గేమ్ అడుతూ డబ్బులు సంపాదించుకోండని అన్‌లైన్ ప్రకటనులు వస్తుంటాయి. ఆ గేమ్ ఆడుతున్న మధ్యలో సైబర్ నేరగాళ్లు వల వేస్తుంటారు. ఈ ఆటలు వ్యసనంగా మారడంతో రూ.లక్షలు పోగొట్టుకుంటున్నారు. అప్పుల పాలైన యువకులు డిప్రెషన్‌లోకి వెళ్లి చివరికి ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఇటీవల నాగలాపురం యూనియన్ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ ఇలానే దెబ్బతిని ప్రస్తుతం జైల్లో ఉన్నాడు. కావున అందరూ అప్రమత్తంగా ఉండాలి.

మా పాఠశాల ఆవరణలో కాలువ నిర్మాణం వద్దు

ప్రజాశక్తి - పిచ్చా టూరు: పిచ్చాటూరు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు తమ పాఠశాల ప్రాంగణంలో వర్షం నీరు వెళ్లేందుకు డ్రైనేజీ కాలువ నిర్మించవద్దని, ప్రహరీ గోడ కట్టించాలని కోరుతున్నారు. గతంలో ప్రహరీ గోడ నిర్మాణానికి నిధులు మంజూరై, 60 శాతం పూర్తయింది. స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం చొరవతో మరలా 38 లక్ష రూపాయలు మంజూరై మిగిలిన ప్రహరీ గోడ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో కీలపూడి గ్రామ ప్రజలు ఈ పాఠశాల మీదగా వర్షపు నీరు వెళ్ళుటకు కాలువ నిర్మించాలని కలెక్టర్‌కు అర్జీ పెట్టుకోగా, సంబంధిత అధికారులు పాఠశాల ప్రాంగణాన్ని పరిశీలించారు. కానీ తమ పాఠశాల ఆవరణలో కాలువ నిర్మాణం చేయొద్దని, దోమలు వ్యాప్తి చెందితే తమకు ఇబ్బందని అధికారులకు విజ్ఞప్తి చేశారు.



కాలువ నిర్మాణం అడ్డుకుంటాం



ఆరో తరగతి నుంచి పదవ తరగతి వరకు నేను ఈ పాఠశాల నందు చదువుతున్నాను. గత ఐదేళ్లుగా వర్షం వస్తే కీలపూడి గ్రామం నుంచి వర్షపు నీరు డ్రైనేజీ నీరు మా పాఠశాలలో నిలుస్తోంది. వాటి ద్వారా అనారోగ్యానికి గురై ఆస్పత్రి పాలవుతున్నాము. కావున జిల్లా అధికారులు ఈ విషయమై పాఠశాల మీదగా వర్షపు నీరు వదిలేది మానుకోవాలని లేనిపక్షంలో విద్యార్థులు ఏకమై అడ్డుకుంటాము.

- బంధన కుమారి, తొమ్మిదో తరగతి

దోమలునుండి కాపాడండి



ఎన్నో ఏళ్లుగా వర్షపు, డ్రైనేజ్ నీరు మా పాఠశాల మీదగా కీలపూడి గ్రామ ప్రజలు వదులుతున్నారు. ఇన్ని రోజులు దోమలు, జ్వరాలతో ఇబ్బంది పడ్డాం.ఇపుడు ప్రహరీ గోడ నిర్మాణం జరుగుతోంది. గురువారము అధికారులు వచ్చి పాఠశాల స్థలంలో వర్షపు, డ్రైనేజీ నీరును వదులుటకు పరిశీలించారు. మా ఇబ్బందిని గమనించాలి.

లాస్య, పదవ తరగతి

వర్షం, డ్రైనేజీ నీరు పాఠశాల అవరణలో వదలకూడదు



పిచ్చాటూరు ఉన్నత జడ్పీ పాఠశాలలో పేద విద్యార్థులు, గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చి ఎక్కువమంది చదువుకుంటున్నారు. అలాంటి చోట కీలపూడి గ్రామ వర్షం, డ్రైనేజీ నీళ్లను పాఠశాల మీదగా మళ్లిస్తే తప్పకుండా అడ్డుకుంటాము. ఈ పాఠశాల విద్యార్థుల కమిటీ ఛైర్మన్‌గా నాపై బాధ్యత ఉంది. కాబట్టి దీనిని పూర్తిగా వ్యతిరేకిస్తున్నాను.

వినాయగం, విద్యార్థుల కమిటీ ఛైర్మన్, పిచ్చాటూరు మండలం

విద్యుత్ సంస్థలో పోస్టులు భర్తీ చేయాలి



ప్రజాశక్తి - తిరుపతి సిటీ: పెరుగుతున్న వినియోగదారుల పని భారానికణుగుణంగా విద్యుత్ సంస్థలో నూతన పోస్టులను మంజూరు చేసి, వెంటనే భర్తీ చేయాలని తెలుగు నాడు విద్యుత్ కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సాంబశివరావు, ప్రధాన కార్యదర్శి సుగుణాకర్ డిమాండ్ చేశారు. ఈ విషయమై ఆదివారం సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ నిరంతర విద్యుత్ సరఫరా అందించుటకు బాధ్యతతో విధులు నిర్వహిస్తున్నామని, మా న్యాయబద్ధమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి -కోట : కోట మండలంలోని విద్యానగర్‌లో ఉన్న సాయిబాబా మందిరం వద్ద నెల్లూరు సుశీల నేత్రాలయ ఆధ్వర్యంలో ఉచిత కంటి మెగా క్యాంప్‌ను ఆదివారం నిర్వహించారు.ఈ శిబిరంలో నెల్లూరు సుశీల నేత్రాలయ చైర్మన్ డాక్టర్ పి.సుధాకర్ రావు,డాక్టర్ వి. సువర్ణలు పాల్గొన్నారు. ఈ శిబిరంలో 200 మంది కంటి పరీక్షలు చేయించుకున్నారు.

టీటీడీపై నగరపాలక సంస్థ జట్టు గెలుపు



ప్రజాశక్తి - తిరుపతి సిటీ : ఎస్వీయూ తారకరామా క్రీడా మైదానంలో జరుగుతున్న మెగా కార్పొరేట్ క్రికెట్ లీగ్ పోటీల్లో ఆదివారం తిరుపతి నగరపాలక సంస్థ, టీటీడీ మాస్టర్ బ్లాస్టర్స్ పోటాపటీగా తలపడ్డాయి. తిరుపతి నగరపాలక సంస్థ జట్టు నరేష్ టీం ఘన విజయం సాధించింది. జట్టు సభ్యులను నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య, అధికారులు అభినందించారు.

సందీపకు డాక్టరేట్ ప్రదానం



ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం మేనేజ్మెంట్ విభాగం పరిశోధన విద్యార్థిని సందీప సారంగంకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు ఆ యూనివర్సిటీ డీన్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య జీవనజ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈమె ఆ విభాగం ఆచార్యురాలు డాక్టర్ జె కాత్యాయని పర్యవేక్షణలో "ఎ స్టడీ ఆన్ నేచర్ ఆఫ్ ఉమెన్ ఎంటర్ ప్రెన్యూర్ షిప్ ఎమాంగ్ ఎస్ హెచ్ జీస్ ఇన్ ఆంధ్రప్రదేశ్" అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని సమర్పించారు. ఇందుకుగాను ఆమెకు డాక్టరేట్ ప్రధానం చేసినట్లు ఆచార్య జీవనజ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు.

హోమియోపతి వైద్యం చాలా అద్భుతమైనది



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : హోమియోపతి వైద్యం చాలా అద్భుతమైన వైద్యం అని కేకేసి కళాశాల హోమియోపతి డాక్టర్ జె కిషోర్ తెలిపారు. వాకర్స్ అసోసియేషన్ భవనములో అధ్యక్షులు కేవెల్ మూర్తి. అధ్యక్షతన. కేకేసి కళాశాల చైర్మన్ కే.కుప్పయ్య శెట్టి, వైస్ చైర్మన్ కే నరసింహారావు ఆధ్వర్యంలో ఆదివారం చర్మవ్యాధుల నివారణపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మునికృష్ణయ్య, డాక్టర్ శ్రీధర్ రాజు, గోపికృష్ణ, గుణశేఖర్ రెడ్డి, రఫీ అహ్మద్, ద్వారకనాథ శెట్టి, వాకర్ సభ్యులు పాల్గొన్నారు.

శేషాచలం - బయోడైవర్సిటీపై సదస్సు


ప్రజాశక్తి - క్యాంపస్ : యస్వీయు ఎన్ఎస్ఎస్ బ్యూరో, అక్షరా ఫౌండేషన్ సంయుక్తంగా ఈ రోజు ఉదయం 10 గంటలకు ఎస్వీయు సెనేట్ హాల్‌లో "శేషాచలం - బయోడైవర్సిటీ" అనే అంశంపై ఒకరోజు సదస్సు నిర్వహించనున్నట్లు సదస్సు నిర్వాహకులు హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, పరిశోధకులు, అధ్యాపకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కొవ్వూరులో నూతన ఆఫ్ క్యాంపస్ ప్రారంభం



ప్రజాశక్తి - క్యాంపస్ : సంస్కృతాధ్యయనానికి మూలకేంద్రమైన తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో త్వరలో తూర్పుగోదావరి జిల్లాలోని కొవ్వూరులో ఉన్న ఆంధ్రగీర్వాణ విద్యాపీఠాన్ని విశ్వవిద్యాలయ ఆఫ్ క్యాంపస్‌గా త్వరలో ప్రారంభించబోతున్నామని విశ్వవిద్యాలయం వైస్-చాన్సలర్ ప్రొ.జి.యస్.ఆర్ క్రిష్ణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు.

రేపటి నుంచి అన్నమయ్య సంకీర్తన ఉత్సవాలు



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శ్రీ త్యాగరాజ స్వామి కల్చరల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రేపటినుండి 22వ తేదీ వరకు ఐదు రోజులు పాటు తిరుపతి, త్యాగరాజ మండపంలో అన్నమయ్య సంకీర్తనోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ అధ్యక్షులు మోహన్ సుందరం తెలిపారు. ఆదివారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఉత్సవాలకు సంబంధించిన వివరాలను మీడియాకు వెల్లడించారు. ఈ సందర్భంగా సంకీర్తనోత్సవాల గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ విలేకరుల సమావేశంలో ట్రస్ట్ కార్యదర్శి కంచి రఘురాం పాల్గొన్నారు.

మటన్ దుకాణాల్లో తనిఖీలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ప్లాస్టిక్ కవర్లు నిషేధంలో భాగంగా గూడూరు పురపాలక సంఘ పరిధి లోని చికెన్, మటన్ దుకాణాలపై కమిషన ర్ వెంకటేశ్వర్లు ఆదివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పురపాలక కమిషనర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కల్తీ, నిల్వ ఉంచిన మాంసాన్ని విక్రయించినా చికెన్ , మటన్‌లను ప్లాస్టిక్ కవర్లలో విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వెంట పురపాలక సిబ్బంది పాల్గొన్నారు.